www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023



కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మ హెచ్చరించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పాత నేరస్థులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అంతేకాకుండా పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు వీరి కదలికలపై నిఘా ఉంచామన్నారు.

ఉత్సాహం.. ఉత్తేజం



ఘనంగా ప్రారంభమైన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ
మహా ప్రదర్శనకు వేలాదిగా తరలొచ్చిన కార్మికులు
ఎరుపుమయమైన పురవీధులు
ఆకట్టుకున్న డప్పుల హోరు.. కోలాట నృత్యం
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు
దిశానిర్దేశం చేస్తూ సాగిన జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రసంగాలు

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శన ఉత్సాహపూరితం.. ఉత్తేజభరితంగా సాగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కార్మిక నేతలు, కార్మికులతో పురవీధులన్నీ ఎరుపురంగుమయమయ్యాయి. ఎర్ర జెండాలు చేతబూని సిఐటియు జిందాబాద్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడుతామంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. డప్పుల హోరు.. కోలాట నృత్యాలు.. కార్మికుల చిందులతో ప్రదర్శన అడుగడుగునా ఉత్సాహభరితంగా సాగింది.



కేరళ మంత్రి రాజీవ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రముఖ వైద్యులు పిఆర్‌కె.వర్మ, ప్రముఖులు, నేతలు

ప్రజాశక్తి - భీమవరం, రూరల్/ కాళ్ల/ ఆచంట/ పెనుమంట్ర

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు పతాకావిష్కరణ, ప్రారంభోపన్యాలు, పట్టణం నడిబొడ్డున మహా ప్రదర్శన, బహిరంగ సభ సాగాయి. స్వాతంత్ర సంగ్రామం, పన్నుల నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా నేపథ్యం, స్వాతంత్ర సమరయోధులు, అణు శాస్త్రవేత్తలు, కవులు, కళాకారులు నడయాడిన నేల, రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం పట్టణం సిఐటియు రాష్ట్ర మహాసభకు వేదికగా నిలిచింది. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించిన ఈ మహా ప్రదర్శనలో సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, జాతీయ నాయకులు సాయిబాబు, ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింహరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి కార్మిక నేతలు, కార్మికులు వేలాదిగా తరలించారు. ప్రదర్శనలో సిఐటియు భారీ పతాకాలతో మహిళలు ఇరువైపులా అగ్రభాగాన నిలవగా వెనుక భాగంలో దేశ, రాష్ట్ర, జిల్లా కార్మిక నేతలు మహాసభ సూచికగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని చేతబూని ప్రదర్శనలో ముందుకు సాగారు. మహాసభ నేపథ్యంలో డిసెంబర్ 28న ప్రారంభించిన కుప్పం, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా మందాడ నుంచి మూడు ప్రాంతాలను కలిపే రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా ప్రదర్శనలో కలిసి నడిచింది. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన జువ్వలపాలెం రోడ్డు మీదుగా నటరాజ్ థియేటర్, వెంకటేశ్వరస్వామిగుడి, ఉండి రోడ్డు మీదుగా అజంతా క్యాంటీన్, బొంబే స్వీట్స్, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు మీదకు కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కేశవరావు హైస్కూల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణం వరకూ సాగింది. ఈ ప్రదర్శనలో చేసిన నినాదాలతో పట్టణం హోరెత్తింది. కార్మికులకు కనీస వేతనం రూ:26 వేలు అందించాలని, విభజన హామీలు అమలు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, కార్మిక చట్టాల రద్దు ఉపసహరించుకోవాలని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్పని, ఉద్యోగ కార్మిక ఐక్యత వర్ధిల్లాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రదర్శనలో అడుగడుగునా చేసిన నినాదాలు హోరెత్తాయి.

కార్మిక జెండాలతో రెపరెపలాడిన పట్టణం

వేలాది మంది కార్మిక నేతలు, కార్మికులు కార్మిక జెండాలు చేతబూని కదం తొక్కడంతో పట్టణం ఎరుపుమయమైంది. అత్యంత వైభవంగా ప్రారంభమైన సిఐటియు మహాసభ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర కార్మికులు, కార్మిక నేతలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, ఆశా, అంగన్వాడీలతోపాటు ప్రజానీకంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. సుమారు గంటకుపైగా ప్రదర్శన అత్యంత ఉత్సాహంగా సాగింది. ప్రదర్శన ప్రారంభం నుంచి ఏఒక్కరూ చెక్కుచెదరకుండా ఎంచుకున్న ఆశయం కోసం, కార్మిక నేతలు చేసిన దిశానిర్దేశం అమలు చేయడమే లక్ష్యంగా ప్రదర్శనలో ముందుకు సాగారు.



అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న సిఐటియు జాతీయ నేత సాయిబాబు

ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతాలు

సిఐటియు రాష్ట్ర మహాసభ నేపథ్యంలో పట్టణంలో చేపట్టిన భారీ కార్మిక ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతాలు లభించాయి. ఉద్యోగ,



ఎర్ర చీరలతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతోపాటు అనుబంధ కార్మిక సంఘాలు ప్రత్యేక బ్యానర్లు పట్టుకుని ప్రదర్శనకు ఘనంగా స్వాగతం పలికారు. యుటిఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం, బజారు లాగుడు బళ్లు సంఘం, ఏరియా రిక్షా కార్మిక సంఘాలతోపాటు వివిధ అనుబంధ సంఘాలు ప్రదర్శనలో కార్మికులకు, కార్మిక నేతలకు పూల వర్షం కురిపించి స్వాగతం పలికి ప్రదర్శనలో మమేకమై ముందుకు సాగారు.

ఉత్సాహంగా సాగిన ప్రదర్శన

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి జిల్లాలకు సంబంధించిన జిల్లా కమిటీలతో కూడిన బ్యానర్లను ప్రదర్శనలో చేతపట్టుకుని ముందుకు సాగారు. ముఖ్యంగా ప్రదర్శనకు ముందుభాగంలో ప్రజానాట్యమండలి కళాకారుల డప్పు దరువు ఉత్సాహాన్ని ఉప్పొంగేలా చేసింది. అలాగే మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మహా ప్రదర్శన ప్రారంభం నుంచి చివరి వరకు అలుపు చెందకుండా మహిళలు చేసిన కోలాటం ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసింది.



జాతీయ నేతలకు మెమెంటోలు అందిస్తున్న అమరజీవులు సావిత్రమ్మ, లెనిన్‌బాబు కుటుంబ సభ్యులు

భీమవరం వేదిక కావడం గర్వకారణం

బి.బలరాం, ఆహ్వాన సంఘం సహాధ్యక్షులు

కార్మికులు, ఉద్యోగులు, ప్రజల సమస్యల పరిష్కారానికి దేశంలో, రాష్ట్రంలో విశేష కృషి చేస్తున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు భీమవరం వేదిక కావడం తమకు గర్వకారణమైందని మహాసభ సహాయ అధ్యక్షులు బి.బలరాం అన్నారు. స్థానిక అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపంలో సిఐటియు 16 రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ ఉపన్యాసం చేశారు. మహాసభ ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా విష్ణు విద్యాసంస్థల ఛైర్మన్ విష్ణురాజు ఉన్నారని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన రాలేకపోయారని చెప్పారు. దేశాన్ని ఎంతగానో పీడించిన బ్రిటీష్ వలస దోపిడీ వాదులకు వ్యతిరేకంగా గర్జించిన ప్రాంతాల్లో భీమవరం, పశ్చిమగోదావరి ప్రముఖ స్థానంలో ఉన్నాయని చెప్పారు. మన్యం సైన్యంతో తెల్లవాళ్లను గడగడలాడించి, బ్రిటీష్ కసాయి తుపాకీ గుళ్లకు తన గుండెనిచ్చి ప్రాణాలర్పించిన తెలుగుతేజం, తెలుగుజాతి పౌరుషాగ్ని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు జన్మనిచ్చి ఆయన మోగల్లు, భీమవరం, నరసాపురం ప్రాంతాల్లో నడయాడి విద్యభ్యాసం చేశారన్నారు. ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త, దేశ స్వావలంబనకు నిస్వార్థంగా ఎంతో కృషి చేసిన డాక్టర్ అయ్యగారి సాంబశివరావు (ఎఎస్.రావు) కూడా ఈ జిల్లావాసేనని పేర్కొన్నారు. టెట్రాసైక్లిన్ సృష్టికర్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు, ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త జ్ఞానానంద, ప్రఖ్యాత చిత్రకారులు అడవి బాపిరాజు, బాపు, ప్రముఖ కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు, ప్రముఖ జాతీయోద్యమ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం, మహాభారతాన్ని తెనుగీకరించిన తొలి ఆంధ్రాకవి నన్నయ గ్రంథాలయ ఉద్యమకారుడు భూపతిరాజు తిరుపతిరాజు, ఎందరో పేరెన్నికగన్న ప్రఖ్యాత నటీనటులు, సాహితీవేత్తలు, కళాకారులు, పౌరాణిక కళాకారులు, పారిశ్రామికవేత్తలను అందించిన జిల్లా అని చెప్పారు. జాతీయోద్యమంలో భాగంగా సాగిన పన్నుల నిరాకరణ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించి దేశాన్ని ఆకర్షించిన భీమవరం గాంధీచే రెండో బార్డోలిగా పిలవబడి పేరొందిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భీమవరంలో గొట్టుముక్కల బలరామరాజు, వేగేశ్న నారాయణరాజు, ఉద్దరాజు వెంకట్రాజు, ముంత బ్రహ్మం పోలీస్ కాల్పుల్లో వీరోచితంగా ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. పోలీసులు కాల్పులకు సిద్ధపడుతున్నా తాలూకాఫీసు భవనంపైకి ఎక్కి జాతీయోద్యమ పతాకాన్ని వీరోచితంగా మహిళా ఉద్యమ ఎగురవేసి చరిత్ర సష్టించారని పేర్కొన్నారు. జిల్లా జాతీయోద్యమంలో ఉద్దరాజు రామం, దండు నారాయణ రాజు, కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, అన్నే వెంకటేశ్వరరావు,భూపతిరాజు సుబ్బతాతరాజు, ఉద్దరాజు మాణిక్యాంబ, పరకాల పట్టాభిరామారావు వంటి జాతీయోద్యమ నాయకులు కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్ రాకపోవడం, విభజన హామీలు అమలు కాకపోవడం, విశాఖ స్టీల్ అమ్మకానికి పెట్టడం, గంగవరం పోర్టు అదానికి కట్టబెట్టడం, నెల్లూరు కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంట్ అమ్మకం వంటి పాలకుల చర్యలు రాష్ట్ర అభివద్ధికి, ఉపాధి కల్పనకు ఎంతగానో ఆటంకాలవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రాభివద్ధికి ఈ మహాసభలు దోహదం కావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతూ లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

రానున్నకాలమంతా సమరశీల పోరాటాలే

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

సిఐటియు ద్వారా కార్మికులకు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చేందుకు అలుపెరుగని పోరాటం సాగించిందని ఉభయగోదావరి జిల్లాల శాసనమండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సిఐటియు రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికులకు అనేక చట్టాలున్నా వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. సంపదను సృష్టించే పారిశ్రామిక రంగాన్ని ప్రస్తుతం మోడీ ప్రభుత్వం, ఉపాధి కల్పిస్తున్న పారిశ్రామికరంగాన్ని తుక్కుతుక్కుగా చిత్తు కాగితంలాగా కేంద్ర ప్రభుత్వం అమ్మేయడానికి ప్రయత్నించడం హేయమైన చర్యని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. సామ్యవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం సిఐటియు మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న నిరంకుశ విధానాలపై సమరశీల పోరాటాలే మార్గమని ఆయన సూచించారు. పాలకుల మైండ్‌సెట్‌ను మార్చేందుకు కార్మికులందరూ ఏకతాటిపై పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఐక్య ఉద్యమాలకు సమయం ఆసన్నం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

రాబోయే రోజుల్లో తొమ్మిది రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాలకు సమయం ఆసన్నమైందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఓబులేసు సౌహార్ద సందేశమిచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కనీస వేతనాలను కార్మికవర్గం కోల్పోతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ట్రేడ్ యూనియన్‌లు ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. కేంద్రం నుండి రాష్ట్రంకు రావాల్సిన పథకాలు, నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంకు అన్యాయం జరుగుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. చిన్నతనంలోనే అధికారాన్ని చేతపట్టిన జగన్ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

సిఐటియు జెండాను ఆవిష్కరించిన ఆర్ఎస్

సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించి 16వ రాష్ట్ర మహాసభను సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఆర్ఎస్ 96వ సంవత్సరంలో కూడా ఉత్సాహంగా సిఐటియు మహాసభకు వచ్చేందుకు ఎంతో తపించారని రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఉద్యమ నాయకులు గత జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ప్రజా వ్యతిరేకం

సిహెచ్ నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి రంగం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో రావడం అభినందనీయమన్నారు. రైస్‌మిల్లు కార్మికుల ఉద్యమానికి అల్లూరు సత్యనారాయణ, రుద్రరాజు సత్యనారాయణరాజు, కొల్లా వెంకటరత్నం, మీరా, సావిత్రి, తదితరులు సమరశీల పోరాటాలు సాగించారని కొనియాడారు. రాష్ట్రంలోని ఆదర్శవంతమైన పోరాటం ఈ జిల్లాలో సాగించారన్నారు. ఒకప్పుడు వ్యవసాయానికి ప్రధానంగా ఉండే ఈ ప్రాంతం నేడు రొయ్యలు, చేపల చెరువులుగా మారడంతో తాగడానికి నీళ్ల లేక ప్రజలు అనేక రోగాలతో వైద్య సేవల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రతి సిఐటియు కార్యాలయాన్ని ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చి వైద్య సేవలు అందించిన ఘనత సిఐటియుకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కాకుండా సిఐటియు ఎప్పటి నుంచో పోరాటం చేస్తుందన్నారు. రానున్న కాలంలో ఐక్య పోరాటాలే లక్ష్యంగా సిఐటియు ముందుకు సాగనుందన్నారు.

కష్టజీవులను ప్రభుత్వం ఆదుకోదా

ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటిత కార్మికుల ఉన్న ఆ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి అవలంబిస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన జగన్మోహన్‌రెడ్డి అప్రజాస్వామికంగా యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా అంధకారంగానే కనిపిస్తుందన్నారు. కరోనా కష్టకాలంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది, ప్రజల కోసం, తన ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్య సేవలు అందించినా ఎటువంటి వేతనాలూ పెంచకపోవడం దారుణమని ఎద్దేవా చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తుంటే మహిళలని చూడకుండా పోలీసులతో అమానుషంగా దాడి చేయించడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా, సిపిఎస్ రద్దు చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని ఎవరూ కాపాడలేరన్నారు.

ఉద్యమాలను అణిచివేయడం అన్యాయం.

సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి బేబీరాణి

రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకుని కార్మిక ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే సహించేది లేదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి హెచ్చరించారు. ఎర్రజెండాలతో రాష్ట్ర ప్రభుత్వం గుండెల్లో గుబులు పుట్టిందన్నారు. ఈ మహాసభలకు హాజరవుతున్న కార్మిక ప్రతినిధులను భీమవరం రాకుండా ముందస్తుగా పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఉద్యమ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం భావ్యం కాదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఏకతాటిపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న తపన్‌సేన్



గఫూర్



సిహెచ్.నర్సింగరావు



ఓబులేసు



బేబీ రాణి



ఇళ్ల వెంకటేశ్వరరావు



షేక్ సాల్జీ



మహిళల కోలాటం

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నూతన క్యాలెండర్‌ను ఆగిరిపల్లి యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఆగిరిపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిపి గోళ్ల జి.అనూష, ఎంఇఒ పి.రత్నకుమార్, ఎంపిడిఒ డి.సుహాసిని, ఎస్ఐ ఎస్.చంటిబాబులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు, కోశాధికారి రామచంద్రన్, జిల్లా కార్యదర్శి బి.అనురాధ, మహిళా కార్యదర్శులు ఎం.వెంకటలక్ష్మి, కెడివి.లక్ష్మి, జి.అపర్ణ పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు వద్దు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మోటార్లకు మీటర్లను అమర్చవద్దని, జగనన్న ఇళ్లకు మంజూరు చేసే నగదును రూ.ఐదు లక్షలకు పెంచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభ సందర్భంగా అర్హత కలిగిన వారందరికీ జగనన్న ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, ఆగిరిపల్లిలో డ్రెయిన్, అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని, ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు వెంటనే నగదును మంజూరు చేయాలని, ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ క్షమాపణ చెప్పాలని నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎంఎల్ఎ గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, క్షమాపణ చెప్పాలని కోరుతూ ఆ రెండు సంఘాల వారు భీమడోలు రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు శంకర్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు తేరారాజు మాట్లాడుతూ ఒక కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన ఎమ్మిగనూరు ఎంఎల్ఎ రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన గ్రామ రెవెన్యూ అధికారులను, రెవెన్యూ సహాయకులను తొలగించాలని ప్రస్తావించడం సరికాదన్నారు. అనంతరం భీమడోలు తహశీల్దార్ (ఎఫ్ఎసి) షంషుద్దీన్‌కు వినతిపత్రం అందించారు.

ఏరియా ఆసుపత్రి వైద్య సేవలు విస్తరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక మొగ్గళ్ల సరసయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్య సేవలను మరింత విస్తరింపచేయడానికి తన వంతు కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి స్థల దాత మొగ్గళ్ల వీరన్న 114 వ జయంతి వేడుకను మొగ్గళ్ల వెంకటేశ్వరరావు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ ఎలిజా తొలుత వీరన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద నిర్వహించిన సభలో ఎలిజా మాట్లాడుతూ 1968-69లో హాస్పిటల్‌కి వీరన్న స్థలం ఇచ్చారని గుర్తు చేశారు. వీరన్న తండ్రి సరయ్య పేరును హాస్పిటల్‌కి పెట్టినట్లు తెలిపారు. స్థల దాత వీరన్న కుమారుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నూతనభవన నిర్మాణాన్ని, 50 పడకల ఆసుపత్రిని, ఆక్సిజన్ ప్లాంట్‌ని సందర్శించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ మొగ్గళ్ల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనాలను రోగులకు ఎంఎల్ఎ ఎలిజా స్వయంగా వడ్డించారు.

ఆక్వా జోన్ పరిధిలోకి మారాలి

కైకలూరు రూరల్ : నాన్ ఆక్వాజోన్‌లోని రైతులను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్వా జోన్ లోకి మార్పుచున్నామని మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రభిత్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న విస్తీర్ణం, సర్వే నెంబర్లు ఆక్వా జోన్‌లో మార్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆక్వా రైతులు గ్రామ స్థాయిలో నిర్వహించే సభలో తప్పక పాల్గొని తమ వివరాలు తెలియజేయాలన్నారు. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయాలలోని గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించాలని ఆమె వివరించారు.

'చంద్రబాబుకు పేదల ప్రాణాలంటే విలువ లేదు'

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

టిడిపి అధినేత చంద్రబాబుకు పేద ప్రజల ప్రాణాలంటే విలువ లేదని వైసిపి రాష్ట్ర ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దు నోబుల్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు రాజకీయాల కోసం అమాయక ప్రజలను బలి చేస్తున్నారన్నారు. గుంటూరు సభలో గాయపడిన వారిని ఇప్పటి వరకు పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ సిలబస్‌కు చెందిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి పి.రత్నకుమార్ అన్నారు. ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు రచించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.అనురాధ, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గణపవరం

పార్టీ కార్యకర్తలకు జనసేన పార్టీ అండదండలు ఉంటాయని ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయాలపాలైన నాగబాబు వైద్యం పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని పచ్చమట్ల ధర్మరాజు సోమవారం పరామర్శించారు. పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు సేకరించిన రూ.80 వేల విరాళాన్ని పచ్చమట్ల ధర్మరాజు చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం దాబా సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం నుంచి జీలుగుమిల్లి వైపునకు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నెంబర్ ఆధారంగా మృతుడు టి.నరసాపురం మండలనికి చెందిన మద్దాల ఏసుబాబుగా గుర్తించారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. జీలుగుమిల్లి ఎఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని పాత శివాలయం పక్క వీధిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ నివాసం వద్ద వంట గ్యాస్ సిలిండర్ లీకై విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించింది. సమీపంలోని వారు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలికి చేరకుని మంటలను అదుపు చేశారు. ఇంటిలోని నిత్యావసరాలు, దుస్తులు, ఇతర పరికరాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. కట్టు బట్టలతో రోడ్డుపై నిలిచామని బాధితురాలు మద్దిరాల రమణమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతోంది. పట్టణ ఎస్ఐ శివనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం పంచాయతీ కొత్తపండువారిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జంగారెడ్డిగూడేనికి చెందిన ఆర్‌టిసి బస్సు టైరు పంక్చర్ అయ్యి ఎదురుగా అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో నలుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అందులో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటరనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్షతగ్రాతులు మండలంలోని లక్ష్మీపురానికి చెందినవారిగా గుర్తించారు.

సిఐటియు రాష్ట్ర మహాసభకు తరలిన కార్మికులు



భీమడోలు నుంచి వెళ్తున్న వాహనాలు

ప్రజాశక్తి - భీమడోలు

చలో భీమవరం కార్యక్రమానికి భీమడోలు నుంచి 500 మంది తరలివెళ్లారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ కోసం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణకుమారి, సాల్మన్‌రాజు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించగా భీమడోలు మండలం నుంచి పెద్దఎత్తున సిఐటియు కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. పూళ్ల గ్రామం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు జెండా ఊపి ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు.

జీలుగుమిల్లి : భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభ నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభకు మండలం నుంచి వివిధ రంగాల కార్మికులు మంది తరలివెళ్లినట్లు సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు తెలిపారు. మండలంలోని 12 పంచాయతీల వివిధ రంగాల కార్మికులు పలు వాహనాల్లో తరలివెళ్లారు.

చింతలపూడి : సిఐటియు రాష్ట్ర మహసభకు భీమవరం పట్టణానికి చింతలపూడి నుంచి 200పైగా మంది కార్మికులు, ఉద్యోగులు తరలివెళ్లారు. రెండు బస్సులు, నాలుగు వ్యాన్లలో చింతలపూడి పాత బస్టాండ్ నుంచి బయలుదేరి వెళ్లారు. మానవత సంస్థ అధ్యక్షులు ఎ.అప్పారావు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు నత్తా వెంకటేశ్వరరావు, ఎం.బాలరాజు, సిఐటియు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం, సరళ, ఫణి, కవిత, శాంతిశ్రీ, సరళాదేవి, దివ్య, పద్మ, కమలకుమారి పాల్గొన్నారు.

చాట్రాయి : పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న 16వ సిఐటియు రాష్ట్ర మహాసభకు కార్మికులు తరలి రావాలని సిఐటియు మండల కార్యదర్శి కొలికి పోగు భాస్కరరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అనేక రకాల కార్మికులు బహిరంగ సభలో పాల్గొనాలని, కార్మికుల సమస్యలు బహిరంగ సభ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. భవన నిర్మాణరంగ కార్మికులు, పెయింటర్ వర్కర్స్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎలక్ట్రికల్ కార్మికులు, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు, పాల్గొని రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

రసాభాసగా మండవల్లి గ్రామసభ

ప్రజాశక్తి - మండవల్లి

మండల కేంద్రమైన మండవల్లి గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామస్తులు ముక్తకంఠంతో సమస్యలపై ప్రశ్నించారు. గ్రామస్తులు అడిగే ప్రశ్నలకు సర్పంచి కార్యదర్శులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా సమాధానం చెప్పలేక తలలు పట్టుకున్నారు. సమస్యలు పరిష్కారం చేయలేనప్పుడు గ్రామసభ నిర్వహించడం ఎందుకని గ్రామస్తులంతా ప్రశ్నించారు. మండవల్లి గ్రామసభ సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలపై ప్రశ్నించారు. కుక్కలు, ఆవులు, మేకలు, పందుల స్వైర విహారంపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందడం లేదని, పిహెచ్‌సిలో వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పంచాయతీ స్థలాలను, శ్మశానాలను ఆక్రమించేస్తున్నా ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. పంచాయతీకి ప్రభుత్వానికి ఆదాయానికి గండిపడేలా భారీ భవంతులు నిర్మిస్తున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. గ్రామసభలో సర్పంచి మాట్లాడకుండా ఆమె భర్త మాట్లాడడం ఏంటన్నారు. సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు పట్టుపట్టారు. గ్రామ ప్రముఖులు చేబోయిన వీర్రాజు మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే ఉండాలన్నారు. గ్రామసభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తప్పనిసరిగా ప్రశ్నిస్తారని, ఆ సమస్యలను దశల వారీగానైనా పరిష్కరించాలని చెప్పారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచి జొన్నలగడ్డ సొసైటీ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు గ్రామ ప్రముఖులు రంగారావు, కార్యదర్శి తోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




గ్రామసభలో మాట్లాడుతున్న గ్రామస్తులు

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలానికి 328 నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. దీనిలో భాగంగా 14 వృద్ధాప్య, 121 వితంతు, మూడు ఒంటరి మహిళ, 60 వికలాంగులు, నలుగురు కల్లు గీత కార్మికులు, 36 మత్స్యకార పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో నిర్వహించనున్న పెన్షన్ల వారోత్సవాల సందర్భంగా నూతన లబ్ధిదారులకు ఎంఎల్ఎ చేతుల మీదుగా వీటిని అందించనున్నట్లు తెలిపారు. మండలంలో 8,934 పెన్షన్లు కొనసాగుతుండగా ఆదివారం సాంకేతిక ఇబ్బందుల కారణంగా 6,857 మందికి సుమారు రూ.1.90 కోట్లు పెన్షన్లు అందించామన్నారు. ఈ శాతం 76గా నమోదైందని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లోపాలను అధిగమించి పూర్తిస్థాయిలో పెన్షన్లు అందించామన్నారు. వీటిలో కొన్నింటికి వివరాలపై గల అభ్యంతరాలను పరిశీలిస్తున్నట్లు మండల పరిషత్ అభ్యర్థి అధికారి తెలిపారు.



భీమడోలులో పెన్షన్ అందిస్తున్న సునీత మాన్‌సింగ్, భవానిరంగా

బుట్టాయగూడెం :బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన 215 పింఛన్లను, మంజూరు పత్రాలను అర్హులకు ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి, తహశీల్దార్ ఎస్ఎస్ శాంతి, సొసైటీ అధ్యక్షులు సత్యనారా యణ, వైసిపి మండల కన్వీనర్ రత్నాజీ పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలో ఎండపల్లి పంచాయతీ మల్లేశ్వరం బిసి కాలనీలో సోమవారం నూతన పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా వైసిపి వికలాంగుల రీజనల్ ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ తాటిపర్తి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 62 లక్షల పింఛన్లను పెంచిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎడ్ల మోహన్‌రావు, ఉపసర్పంచి గద్దె ప్రసాద్, వైస్ ఎంపిపి గుత్త కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లా ఎస్‌పి ఆదేశాలు మేరకు ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి టెన్నీస్‌బాల్, క్రికెట్ టోర్నమెంట్ గురజ గ్రామంలో ఈ నెల మూడో తేదీ మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎస్ఐ షణ్ముఖసాయి తెలిపారు. యువత సంక్రాంతి పండుగ సందర్భంగా పేకాట, కోడిపందెలు, గుండాట వైపు వెళ్లకుండా పోలీస్ వారి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతి, రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.పది వేలతో పాటు ట్రోఫీ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువకులు వివరాలకు 9676516572 సంప్రదించాలని కోరారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆగిరిపల్లిలోని శ్రీశోభనాచల వ్యాఘ్ర నృసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనం కోసం సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వేదాంతం వెంకట శేషుబాబు, అనంతకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎన్.భవాని, భక్తులు పాల్గొన్నారు.

'ప్రతిభ'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక సుబ్బారెడ్డి కాలనీలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, సుభాష్ రెడ్డి తోరణాలు కట్టి ప్రారంభించారు. భోగిమంటలు వేసి సంక్రాంతి పండుగ సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నృత్యాలు చేస్తూ అ ఆలారించార. ప్రిన్సిపల్ సరోజా రెడ్డి, సింధూ రెడ్డి పాలు పొంగించారు. బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సరోజారెడ్డి మాట్లాడుతూ కనుమరుగవుతున్న మన సంస్కృతికి పెద్ద పీట వేయడమే తమ ధ్యేయమన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే విధానంలో వాలంటీర్లతో పాటు (గ్రేడ్ -5)పంచాయతీ కార్యదర్శులు కుడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ముసునూరు ఎంపిడిఒ జి.రాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ, ఎఒ కూచిపూడి సాయిరాము, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమని తోటపల్లి గ్రామ సర్పంచి ఆరేపల్లి శ్రీపద్మ అన్నారు. విజయవాడ, నూజివీడు లయన్స్‌క్లబ్ సహకారంతో సోమవారం మండల పరిధిలోని తోటపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పలు పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి, నూజివీడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు ఎంఎల్ఎస్ఆర్‌కె.ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఇండేన్ గ్యాస్ మేనేజింగ్ పార్టనర్ పివి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్‌బికెల సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

విత్తనం నుంచి విక్రయం వరకు బాధ్యత స్వీకరించిన రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉష రాజకుమారి కోరారు. భీమడోలులోని తన కార్యాలయంలో సహచర ఉద్యోగులు, సిబ్బంది సోమవారం ఏర్పాటుచేసిన నూతన సంవత్సర వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సహచర ఉద్యో గులు, సిబ్బంది ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు మాట్లాడుతూ గత సీజన్‌లో భీమడోలు మండలానికి కేటాయించిన 28,850 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయిందన్నారు. ప్రస్తుత సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తమ పంట వివరాలు ఇ-క్రాప్ ద్వారా నమోదు చేయిం చుకోవాలని కోరారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని భీమడోలు కేంద్రంగా ప్రభుత్వం అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేసిం దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికా రులు ఉషారాణి, రవికుమార్, ద్వారకాతిరుమల వ్యవసాయా ధికారితో పాటు అధిక సంఖ్యలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సహాయకులు

కదిలిన చెత్త సేకరణ రిక్షాలు — ప్రజాశక్తి వార్తకు స్పందన



చెత్త సేకరణ రిక్షాలో చెత్త వేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు మూలనపడిన చెత్త సేకరణ రిక్షాలు సోమవారం రోడెక్కాయి. నిరూపయోగంగా చెత్త సేరకణ రిక్షాలు అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు జిల్లాస్థాయి అధికారులు స్పందించారు. దీంతో అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలు మేరకు గురజ గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్‌వి.రమణ మరమ్మతులకు గురై స్థలం లేక వాటర్ ట్యాంక్ వద్ద ఉంచిన చెత్త సేకరణ రిక్షాలను బయటకు తీసి సోమవారం ఉదయం వెంటనే మరమ్మతులు చేయించిన ఆనంతరం గ్రామంలో చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు రిక్షాలను తీసుకొని బయల ుదేరారు. ఈ సందర్భంగా కార్యదర్శి రమణ మాట్లాడుతూ పాత రిక్షాలు నాలుగు ఉన్నాయన్నారు. వాటితో రోజు చెత్త సేకరణ జరుగుతుందన్నారు. పాత రిక్షాల మరమ్మతులకు గురైతే వాటికి మరమ్మతులు చేసేంతవరకు అదనంగా ఉన్న రెండు కొత్త రిక్షాలతో చెత్త సేకరణ జరుగుతుందన్నారు. మరమ్మతుల దృష్ట్యా పంచాయతీ కార్యాలయం వద్ద స్థలం లేకపోవడంతో చెత్త సేకరణ రిక్షాలను గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం వద్ద ఉంచినట్లు తెలిపారు. గ్రామంలోని అన్నీ వీధుల్లో చెత్త సేరకణ రిక్షాల ద్వారా రెండు పూటలా జరుగుతోందని చెప్పారు.

ప్రాధాన్యత ప్రకారం పామాయిల్ మొక్కలు అందించాలి

చింతలపూడి :పామాయిల్ మొక్కలు ప్రాధాన్యత ప్రకారం పంపిణీ చేయాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన నిర్వహించే గోద్రేజ్ కంపెనీని ముట్టడి కార్యక్రమాన్ని జయప్ర దం చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు, పామాయిల్ రైతు మామిళ్లపల్లి వసంతరావు, పామాయిల్ రైతుల ఐక్యవేదిక కన్వీనర్ పుల్లూరి సోమశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో సిపిఐ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సోమవారం పామాయిల్ రైతులు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు, సోమశేఖర్ మాట్లాడుతూ పామాయిల్ మొక్కలు ప్రాధాన్యత ప్రకారం పంపిణీ చేయాలని నెల రోజుల నుంచి రైతులు ధర్నా నిర్వహించినా, తహశీల్దార్ సమక్షంలో సమావేశం నిర్వహించి తీర్మానించినా గోద్రేజ్ కంపెనీ యాజమాన్యం ఆ ఒప్పందాన్ని అమలు చేయడంలేదన్నారు. పామాయిల్ మొక్కలు ప్రాధాన్యత ప్రకారం పంపిణీ చేయాలని నాలుగో తేదీన గోద్రేజ్ కంపెనీని ముట్టడి చేస్తున్నాయని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ఎపి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.కాలేశా, దొంత కృష్ణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాబు, పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విచ్చలవిడిగా పందులను నివాస ప్రాంతాల్లో తిరగనివ్వకూడదని నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన సచివాలయ పారిశుధ్య కార్యదర్శి దుర్గారావుపై పందుల పెంపకం దారుడు నరసింహారావు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానిక 27వ వార్డు డాంగేనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పందుల మాంసం వ్యర్థాల వల్ల గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నివాసాల మధ్య పందులు పెంచుతున్నవారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నివాసాలకు దూరంగా పందులు పెంచాలని, పంది మాంసం వ్యర్థాలను నివాసాలు, వసతి గృహాలు, కళాశాలల సమీపంలో వేయరాదని సూచించామని తెలిపారు. ఈ క్రమంలో డాంగేనగర్‌లో పందుల పెంపకం దారులకు పదో వార్డు సచివాలయ సిబ్బందికి నోటిసులు అందించారని తెలిపారు. నరసింహారావు అనే పందుల పెంపకం దారుడికి నోటీసు ఇవ్వడానికి వెళ్లిన పారిశుధ్య సెక్రటరీ దుర్గారావుపై దాడి చేసి ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్ లాక్కున్నారని తెలిపారు. ఈ విషయం వాలంటీర్ ద్వారా తెలుసుకున్న సచివాలయ అడ్మిన్ చిట్టిబాబు ద్వారా సమాచారం తెలిసి మున్సిపల్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నామని తెలిపారు. అప్పటికే పందుల పెంపకందారుడు నరసింహారావు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధం గా అడ్డగోలుగా పందులు పెంపకం కోసం ఏర్పాటు చేసిన గుడిసెలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. స్థానిక ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా దాడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గారావును పరామర్శించారు. కారణాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బందిపై దాడి జరగకుండా రక్షణ కల్పించాలని స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. కౌన్సిలర్ అయినాల వెంకట రమణమూర్తి దొంత మాధవ, వైసిపి నాయకులు బత్తిన చిన్న అప్పటికే ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న సచివాలయ సెక్రటరీ దుర్గారావును పరామర్శించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా పందులను వదిలేయటం సరికాదన్నారు. విడిగా పందులను వదిలేస్తున్న వారికి నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి గురై ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న దుర్గారావు ఎంఎల్‌సి రిపోర్టు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు సమాచారం.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీలోని ఎంపిపి పాఠశాలను వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం టి.శేఖర్ సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను జగనన్న విద్యాకానుక వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం చాలా బాగుందని, పాఠశాల ఆవరణలో పూల మొక్కల తోట, చల్లని గాలి వేసే చెట్లు పరిసర వాతావరణం ఆహ్లాదకరంగా ఉందన్నారు. వంట ఏజెన్సీ సభ్యులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి నాగేశ్వరరావు చేస్తున్న పాఠశాల అభివృద్ధిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ సంఘాలు, గురవాయిగూడెం అయ్యప్పక్షేత్రం సభ్యులు నిరసన తెలిపారు. అయ్యప్ప దీక్షదారులు మండలంలోని గురవాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయం నుంచి జంగారెడ్డగూడెం వరకు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గుర్వాయిగూడెం అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పలువురు అయ్యప్ప స్వామి దీక్షదారులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి శఠగోపం బహూకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం నాయుడుపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాదుకు చెందిన బెండి సీతారామయ్య శఠగోపం, వెండి పళ్లెంను రూ.1.10 లక్షలతో వితరణ చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని నిర్వాహకులు, ఎంపిటిసి మాజీ సభ్యులు బొమ్మిడి రాంబాబు, అనిల్‌కుమార్, సత్యనారాయణ, తవిటినాయుడు తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

ఇపి.44/2010 ఇన్ ఒఎస్.83/2005

యెర్రా ఇందిర ...డిక్రీ హోల్డర్

మరియు

యెలమాటి సత్యనారాయణ ...జడ్జిమెంటు డెటారు

ప్రకటన

పై నెంబరు పిటీషనులో తన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం యీ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని బహిరంగ వేలం వేయడం ద్వారా వసూలు చేయించగలందులకు కోరగా శ్రీ కోర్టు వారు ది.18-01-2023 తేదీ ఉదయం గం.10.30 ని॥ల లగాయితూ పైకోర్టులో బహిరంగ వేలం వేయుదురు. పాటలో పాల్గొనువారు వచ్చి పాటలో పాల్గొనవచ్చును. పాట పాడుకున్న వారు అదే రోజు 1/4వ వంతు పాటసొమ్ము చెల్లించవలెను.

షెడ్యూలు : పశ్చిమ గోదావరి జిల్లా, అనంతపల్లి సబ్ రిజిస్ట్రీ, ప్రకాశరావుపాలెం గ్రామం, నల్లజర్ల మండలం, ఆర్.ఎస్.నెం.74/1 లోయ.3-49 సెంట్లు వ్యవసాయ భూమికి హద్దులు: తూర్పు: ఆలపాటి ఆంజనేయ కాంత పద్మావతి ప్రస్తుతం సుంకర శ్రీరామకృష్ణ, దక్షిణం: అప్పసాని రామాయమ్మ ప్రస్తుతం అప్పసాని వెంకట రామారావు, పడమర: కరుటూరి రత్నం ప్రస్తుతం గిద్దా పద్మ, ఉత్తరం : అన్నరెడ్డి రామచంద్రరావు, ప్రస్తుతం అన్నంరెడ్డి లక్ష్మీమాత వగైరాలు (తాడేపల్లిగూడెం లార్జ్ సైజ్ కోపరేటివ్ సొసైటీలో తనఖా బాకీ వహించి వేలం వేయబడును).

DHR వేల్యు : 25,00,000/-

అమీనా వేల్యు : 10,50,000/-

తాడేపల్లిగూడెం **బి.హెచ్.శేషు**

ది.31-12-2022 పిటీషనరు తరపు న్యాయవాది

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం అడిషినల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

సి.సి.నెం.108/2020

జి.ఆర్.వి.ప్రసాద్ ...కంప్లయింట్

అండ్

నాగిరెడ్డి రవిశంకర శ్రీనివాస్ ...ముద్దాయి

పై నెంబరు కేసులో ముద్దాయి అయిన నాగిరెడ్డి రవి శంకర శ్రీనివాస్, తండ్రి సన్యాసిరావు, డోర్‌నెం. 9-11-6/2, చెన్నారెడ్డి వారి వీధి, నియర్ అయ్యప్ప టెంపుల్, 15వ వార్డు, సవిత్రుపేట, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా అనువారికి ఎన్ని పర్యాయములు ముద్దాయికి సమన్లు పంపినను తీసుకొనకుండా తప్పించు కొనుచున్నందున చెక్కు కేసులో ముదాయి అయిన మీకు సమన్లు అమలు నిమిత్తం ఈ ప్రకటన ద్వారా అమలు జరుపుటకు కోర్టు వారు ఉత్తర్వులు యిచ్చినారు.

కావున మీరు పై కోర్టులో ది.11-01-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరు అయ్యి అభ్యంతరము ఉన్నచో స్వయంగా గాని లాయర్ గారి ద్వారా హాజరు అవ్వగలరు. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానము చేయబడును.

జి.సాయికృష్ణ, కె.ప్రసాదు

తాడేపల్లిగూడెం అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.

ది.02-01-2023 సెల్: 9848377977